క్లుప్తంగా

నేడు లింగాలకు ఎంపీ రాక

లింగాల : మండలంలో బుధవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పర్యటించనున్నారు. లింగాల కుడికాలువ గట్టున సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని ఆయన ప్రారంభించనున్నారు. లింగాల చెరువుకు నీటిని అందించేందుకు ఈ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించనున్నారు. రెండు 250 హెచ్‌పీ మోటార్ల ద్వారా రోజుకు 8 క్యూసెక్కుల చొప్పున నీటిని తరలించనున్నారు. ఈ కార్యక్రమంలో పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు తెలిపారు.

డీజిల్ ధర తగ్గింపు

పులివెందుల : రిలయన్స్ పెట్రోల్ బంకులలో డీజిల్ ధర పబ్లిక్ సెక్టార్ బంకుల కంటే లీటరుకు ఒక్క రూపాయి తగ్గించినట్లు పులివెందుల రిలయన్స్ పెట్రోల్ బంకు ప్రతినిధి తెలిపారు. మంగళవారం ఆయన తెలుపుతూ డీజిల్ ధర తగ్గడంతో పాటు అడిటీస్ కలపడం వల్ల మైలేజీ పెరగడమే కాక ఇంజన్ లైఫ్ పెరుగుతుందన్నారు. రిలయన్స్ పెట్రోలు బంకులలో డీజిల్ ధర తగ్గించడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు పుస్తక పఠనం


కథలు వింటున్న విద్యార్థులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని పులివెందుల శాఖ గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా మంగళవారం విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా టీచర్ హరిత విద్యార్థులకు చక్కటి కథలు చెప్పి అలరించారు. అనంతరం విద్యార్థులకు ఐస్‌క్రీమ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కృష్ణకిశోర్‌రెడ్డి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాయపడిన ఆవుకు వైద్యం


ఆవుకు చికిత్స అందిస్తున్న పశువైద్యులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో మంగళవారం ఆవు కాలుకు తీవ్ర గాయమై ఇబ్బందులు పడుతుండగా.. స్థానికులు స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజుకు సమాచారం ఇవ్వడంతో వెంటనే డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్య వాహన హెల్ప్‌లైన్ నెంబర్ 1962కు ఫోన్ చేశారు. దీంతో పశువైద్యులు అక్కడికి చేరుకుని గాయపడ్డ ఆవుకు వైద్య అందించారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించొద్దు


షాపుల యజమానులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రోషన్

సింహాద్రిపురం : ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దని ఎస్‌ఐ రోషన్ వాహనదారులకు సూచించారు. మంగళవారం సాయంత్రం సింహాద్రిపురంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆయన పర్యటించారు. బస్టాండ్ సెంటర్‌లో షాపుల ఎదుట వాహనాలు ఎక్కడ పడితే అక్కడ ఆపి ట్రాఫిక్ సమస్యను తలెత్తకుండా చూడాలని వాహనదారులను ఆయన హెచ్చరించారు. అలాగే షాపు యజమానులు కూడా వాహనాలు రోడ్డుకు అడ్డంగా ఉంచకుండా చూడాలన్నారు.

ఏపీ సంక్షేమ పథకాల పుట్టినిల్లు

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : సంక్షేమ పథకాల పుట్టినిల్లు ఏపీ అని ప్రపంచంలో ఎక్కడాలేనన్ని పథకాలు ఆంధ్రప్రదేశ్‌లో అమలు అవుతున్నాయని అది కేవలం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడంతోనేనని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పెద్దచెప్పలి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గ్రామ నాయకులు పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చుతూ స్వాగతం పలికారు. ముందుగా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రతి గడపకు వెళ్లిన ఎమ్మెల్యే వారి సమస్యలు తెలుసుకున్నారు. రేషన్ కార్డు, సీసీ రోడ్లు, ఇంటి స్థలాలు, పక్కాగృహాలు కావాలని ప్రజలు కోరడంతో అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించారు. ఇంకా పథకాలు రానివి ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని ప్రజలకు సూచించారు. అవ్వా తాతలకు వారి మనవడు జగనన్న ఇస్తున్న పింఛన్ రూ.2750 దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వడం లేదన్నారు. పుట్టిన బిడ్డ మొదలుకొని పండుటాకుల వరకు అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అందిస్తున్న ఏకైక సీఎం జగనన్న అన్నారు. చంద్రబాబునాయుడు దొంగ హామీలిచ్చి సీఎం అయ్యారని, ఒక్క హామీకూడా నెరవేర్చలేదన్నారు. బాబు తన పాలనంతా అవినీతికి కేరాఫ్‌గా పెట్టుకున్నారన్నారు. జన్మభూమి కమిటీలు లంచాలు, కమీషన్లు ఇచ్చిన వారికే అరకొర పథకాలు ఇచ్చారన్నారు. ప్రస్తుత జగనన్న ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిందన్నారు. 31 లక్షల మందికి ఇంటి స్థలాలు ఇవ్వడమే కాక 17లక్షల మందికి పక్కా గృహాలు కట్టించాడన్నారు. కార్యక్రమంలో పెద్దచెప్పలి చిన్ని, మర్రి సుబ్బన్న, మహ్మద్ గౌస్, చంద్రపాల్, చంటి, అయ్యవార్‌యాదవ్, చెన్నారెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, మహ్మద్ సాదిక్, ఇర్ఫాన్, రెడ్డి కరీం, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు పెద్దచెప్పలికి..

మండలంలోని పెద్దచెప్పలి సచివాలయ పరిధిలో బుధవారం రెండవరోజు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ శేషా చలపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన తెలిపారు.

రేపు గడప గడపకు మన ప్రభుత్వం

వీరపునాయునిపల్లె : మండలంలోని గంగిరెడ్డిపల్లె సచివాలయ పరిధిలోని సంగాలపల్లె, మిట్టపల్లె, గంగిరెడ్డిపల్లె గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని మండల కన్వీనర్ రఘునాథరెడ్డి తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సమస్యలను పరిష్కరించండి


సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల ఉద్యోగులు

పులివెందుల రూరల్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి గురుకుల పాఠశాలల ఉద్యోగులు వినతిపత్రం అందించారు. మంగళవారం విజయవాడలో ఏపీ ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని టీచర్స్ ఎమ్మెల్సీలు చంద్రశేఖర రెడ్డి, రామచంద్రారెడ్డి, ఏపీజీయూఎఫ్ చైర్మన్ కె.వెంకటరామిరెడ్డి, స్వర్ప్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్, వైఎస్సార్ గురుకుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నజురుల్లాల ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలల ఉద్యోగులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగులకు 60 ఏళ్ల నుంచి 62 ఏళ్ల వయోపరిమితి పెంపు అమలు చేయాలని, కాంట్రాక్టు టీచర్స్ ప్రతి ఏడాదివలే 10 రోజుల గ్యాప్ పీరియడ్ తర్వాత రెన్యువల్ చేయాలని, గత 16 ఏళ్ల నుంచి పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్లను రెగ్యులర్ చేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇందుకు ఆయన స్పందించి మీ న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యూనియన్ నాయకులు పీడీ రామచంద్రారెడ్డి, తులసీరాం, బాలయ్య, రాష్ట్ర నాయకులు గురురత్నం, అమరనాథరెడ్డి, మురగారెడ్డి, తిరుపాల్, ప్రవీణ్, జాన్సీ, అంజని, చిన్నయ్య, నరేంద్ర, శ్రీహరి, రవి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

చెన్నూరు : ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కమలాపురం నియోజకవర్గ ముస్లిం మైనార్టీల కన్వీనర్ అన్వర్‌బాషా కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఆయన చెన్నూరులో విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి పవిత్ర హజ్‌యాత్రకు విజయవాడ నుంచి బయలుదేరు 1813 మంది యాత్రికుల విమాన టికెట్టుపై ప్రతి యాత్రికునికి రూ.80 వేలు అదనపు భారం పడుతుండటంతో రాష్ట్ర ముఖ్యమంత్రి అదనపు భారం ఎంతైనా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన యాత్రికులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని ఆయన భరోసా ఇచ్చారు. తానిచ్చిన మాటకు కట్టుబడి రూ.14.51 కోట్లు ఆర్థిక సాయం విడుదల చేసి మరొసారి తాను ముస్లిం మైనార్టీల పక్షపాతి అని నిరూపించుకున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అంజద్‌బాషాకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మునీర్‌అహ్మద్, అబ్దుల్ రబ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్, కరీం తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొడితే చర్యలు

–డీఎస్పీ వినోద్‌కుమార్

చక్రాయపేట : ఎవరైనా మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రశాంతతకు భంగం కలిగించేలా చేస్తే చర్యలు తప్పవని పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని నెరుసుపల్లె వద్ద డేనియల్ అనే వ్యక్తి మత విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరించడమే కాకుండా ఎలాంటి అనుమతులు లేకుండా చర్చి నిర్మాణం చేపట్టారన్నారు. దీనికి తోడు హనుమజ్జయంతి రోజున హిందువులు నిర్వహించిన శోభాయాత్ర సందర్భంగా రోడ్డుకు ఇరు వైపులా విద్యుత్ స్తంభాలకు కట్టిన హనుమాన్ జెండాలను తొలగించారు. ఈ విషయంపై విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చెన్నకృష్ణారెడ్డి, హిందూ ఆలయాల కమిటీ చైర్మన్‌లు రామాంజులరెడ్డి, చక్రపాణిరెడ్డి, రామచంద్రారెడ్డితోపాటు ఆర్‌ఎస్‌ఎస్ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పులివెందుల డీఎస్పీ వినోద్ కుమార్, ఆర్కే వ్యాలీ సీఐ గోవిందరెడ్డి, ఎస్‌ఐ రఘురాంలు ఇరువర్గాలను పిలిపించి హెచ్చరించారు. అలాగే ప్రభుత్వ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని హెచ్చరించారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు తెలియజేస్తామన్నారు. అలాగే ఉన్నతాధికారులకు కూడా సమస్య ను వివరిస్తామని ఆయన తెలిపారు.

గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభం

వేంపల్లె : ఏపీ మైనార్టీ గురుకుల పాఠశాలలు వేంపల్లెలో బాలికలకు, కడప రామాంజనేయపురంలోని బాలురకు 5వ తరగతిలో చేరుటకు డైరెక్టుగా అడ్మిషన్లు పొందవచ్చునని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 6, 7, 8 తరగతులలో ఖాళీగా మిగిలి ఉన్న బ్యాక్‌లాక్ అడ్మిషన్లకు కూడా బర్తీ చేస్తామన్నారు. ఆయా తరగతులకు సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రుల ఆయా పాఠశాలలకు వెళ్లి డైరెక్టుగా అడ్మిషన్లు పొందవచ్చునన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి 30వ తేదీవరకు అడ్మిషన్లు పొందవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 9390001744, 9494791163 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తొండూరు : మండల కేంద్రమైన తొండూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్ సివిల్, మెకానికల్ డీజిల్ ట్రేడ్‌లలో సీట్లకు అర్హులైన పదవ తరగతి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఐటీఐ కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

బీటెక్ రవి.. స్థాయి తెలుసుకుని మాట్లాడు

– వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం


మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల టౌన్ : టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి నీస్థాయి ఏమిటో తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని వైఎస్సార్‌సీపీ నాయకులు, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డిలు తెలిపారు. మంగళవారం పులివెందులలో వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పులివెందల ప్రాంత ప్రజల బతుకులు బానిస బతుకులు అనే స్థాయి నీకు కానీ, నీ పార్టీకి కానీ లేదని విమర్శించారు. పులివెందుల ప్రజలను కించపరిచే విధంగా మాట్లాడితే నాలుక చీరేస్తాం.. గుర్తు పెట్టుకో అని హితవు పలికారు. రాష్ట్రంలో ఎక్కడ ఏమి జరిగినా ప్రతిదానికి పులివెందుల గుండాలు, రౌడీలు కారణమని అన్వయిస్తూ పులివెందుల ప్రజలను అప్రతిష్టపాలు చేస్తే ఊరుకొనేదిలేదన్నారు. పులివెందుల చుట్టూ రోడ్లపై తిరుగు నీకు అభివృద్ధి అంటే ఏమిటో తెలుస్తుందన్నారు. చక్రాయపేటలో జరిగిన సంఘటనతో ఎక్కడ పోలీసులు అరెస్టు చేస్తారోనని ఆందోళనతో తప్పించుకుని తిరిగి మానసిక స్థితి దెబ్బతిని పిచ్చి పట్టినట్లు మాట్లాడుతున్నావని ఎద్దేవా చేశారు. ఇక పులివెందుల అభివృద్ధి నువ్వు చెప్పే కుప్పం, పీలేరు స్థాయి దాటి దేశీయస్థాయిలోనే ఒక మోడల్ సిటీ తరహా అభివృద్ధి, ఈ అభివృద్ధికి సంబంధించి సాక్ష్యాలతో ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. నువ్వు, మీ జిల్లా నాయకుడు వాసు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా రాబోవు ఎన్నికలలో డిపాజిట్లు కూడా దక్కే పరిస్థితి లేదన్నారు. వైఎస్ జగన్, వైఎస్ అవినాష్‌లపై ప్రజలకు ప్రగాఢ విశ్వాసం, నమ్మకం ఉన్నాయన్నారు. గతంలో కంటే వచ్చే ఎన్నికలలో బంపర్ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లె కిశోర్, రాజశేఖర్, మాజీ కౌన్సిలర్ నూరుల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు సోపాల వీరా, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ


జీలుగ విత్తనాన్ని పంపిణీ చేస్తున్న మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి

వీరపునాయునిపల్లె : మండలంలోని యు.రాజుపాళెం రైతు భరోసా కేంద్రంలో మంగళవారం మండల వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో జీలుగ విత్తనాలను మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కష్టాలు గుర్తించి వారిని అన్నివిధాల ఆదుకుంటున్నారన్నారు. 50 శాతం రాయితీతో జీలగ, పిల్లిపిసర విత్తనాన్ని అందించడం జరుగుతోందన్నారు. సహాయ సంచాలకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ రాజుపాళెం రైతు భరోసా కేంద్రానికి 13 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మంజూరయ్యాయని ఇంకా ఎవరికైనా విత్తనాలు కావాలంటే రైతు భరోసా సిబ్బందిని సంప్రదించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు మాట్లాడుతూ వరి సాగు చేసే ప్రతి రైతుకు ఎకరాకు 10 కేజీలు జీలుగ విత్తనాన్ని రాయితీతో అందిస్తున్నామని ఈ అవకాశాన్ని వరి పంట సాగు చేసే రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది గంగయ్య, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత


గొర్రు తగులుకుని విరిగిన విద్యుత్ స్తంభం

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలంలోని తొర్రివేముల గ్రామంలో మంగళవారం మిరప సాగుచేసిన ఓ రైతు పొలంలో పనిచేస్తుండగా ట్రాక్టర్‌కు ఏర్పాటుచేసిన గొర్రు తగులుకుని విద్యుత్ స్తంభం కూలడంతో గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నార్జంపల్లె, తొర్రివేముల తదితర గ్రామాలకు 32 లైన్ ద్వారా విద్యుత్ అందుతోంది. విరిగిపోయిన విద్యుత్ స్తంభం స్థానంలో కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. దాదాపు 8 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ఆశాలకు కనీస వేతనం పెంచాలి

వేంపల్లె : గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు సేవలందిస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనాలు పెంచాలని, సెలవులు ప్రకటించాలని ఆశావర్కర్ల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్, ఆశావర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కల్పన ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.సి. బాదుల్లా, నాయకులు చంద్రశేఖర్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అక్షర బాలికల జూనియర్ కళాశాలలో ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత, సాధారణ సెలవులు, మెటర్నిటీ సెలవులు లేకుండా పనిచేస్తున్న ఆశావర్కర్లకు సెలవులు మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దోమతెరలు వాడుదాం..డెంగీని నివారిద్దాం


కమలాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


జమ్మలమడుగులో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో ర్యాలీ


సీకేదిన్నెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కమలాపురం : దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని మలేరియా అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ నందకుమార్ అన్నారు. మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కమలాపురంలో ర్యాలీ నిర్వహించారు. ఈ దోమ పగలు మాత్రమే కుడుతుందన్నారు. దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే రాత్రిళ్లు దోమతెరలు వాడాలన్నారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగలక్ష్మీరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశాలు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో డెంగీ దినోత్సవాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శాంతికళ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అలాగే పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మలేరియా యూనిట్ అధికారి సుబ్బరాజు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల: సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారిద్దామని పీహెచ్‌సీ డాక్టర్ కళ్యాణ్ దినకర్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవ కార్యక్రమాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య, సీహెచ్‌ఓ శివరాం, హెల్త్ సూపర్‌వైజర్ కుసుమకుమారి, హషియా బేగం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తొండూరులో..

తొండూరు : స్థానిక పీహెచ్‌సీలో జాతీయ డెంగీ దినోత్సవాన్ని పీహెచ్‌సీ డాక్టర్ అరిపుల్లా ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. అలాగే డెంగీ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం డెంగీ వ్యాధి నివారణపై వైద్య, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల కమ్యూనిటీ ఆరోగ్య అధికారిణి రమణమ్మ, సూపర్‌వైజర్ శశికళ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని ప్రజలు డెంగీ జ్వరం పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి రాఘవేంద్ర తెలిపారు. మంగళవారం డెంగీ డే సందర్భంగా మండలంలోని సీకేదిన్నె గ్రామంలో ర్యాలీ చేపట్టి మా ట్లాడారు. ప్రజలు దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సురక్షితమైన నీరుతాగి వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవికుమార్‌రెడ్డి, వైద్యులు సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి


సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

జమ్మలమడుగు : ప్రతి విద్యార్థి మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత డాక్టర్ ప్రశాంతి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో అవగాహన సదస్సును ప్రిన్సిపాల్ మేరీ ఫోరెన్స్ అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులు చదువులతో పాటు కళలు, క్రీడలపట్ల ఏకాగ్రత ఉండాలన్నారు. దేశ జనాభాలో 33 శాతం యువత ఉందన్నారు. కార్యక్రమంలో యువజన సర్వీసులశాఖ అధికారులు సాయిగ్రేస్, సుబ్బరాయుడు, మంతేశుడు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద 4వ వార్డు కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్ ఏర్పాటు చేసిన డాక్టర్ ఇసీ గంగిరెడ్డి మజ్జిగ చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ 40 రోజులుగా నిర్విరామంగా కొనసాగుతోంది. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డిల సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో ప్రతి రోజు ప్రజలకు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

చింతకొమ్మదిన్నె : అటవీశాఖ నూతనంగా ప్రవేశపెట్టిన లైఫ్ అనే కార్యక్రమంలో భాగంగా పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం మనందరిపై ఉందని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఓబులేసు అన్నారు. మంగళవారం మామిళ్ళపల్లె పంచాయతీ పరిధిలోని నాయనోరిపల్లె గ్రామంలో లక్ష్యా అకాడమీ ఆధ్వర్యంలో లైఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్‌హెడ్ ఆఫీసర్ భరణి, బీట్ ఆఫీసర్ రఘువీర్, భైరవ, హర్షవర్ధన్, ఏబీఓ నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్‌గా సదరన్ క్యాంపు నిర్వహించాలి

జమ్మలమడుగు : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రతి సోమవారం సదరన్ క్యాంపును నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకుడు శివనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడు వారాలుగా సదరన్ క్యాంపు నిర్వహించడంలేదన్నారు. ఈ విషయం తెలియని వికలాంగులు అక్కడికి ఖర్చుపెట్టుకుని వస్తే డాక్టర్ లేరంటూ సిబ్బంది చెబుతున్నారన్నారు. సదరన్ క్యాంపులకు సంబంధించిన వైద్యులు ప్రతి సోమవారం హాజరయ్యేవిధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సచివాలయ అమ్యునిటీ సెక్రటరీల బదిలీ

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని వార్డు సచివాలయాలలో పనిచేస్తున్న అమ్యునిటీ సెక్రటరీలు ఏడు మంది బదిలీ అయ్యారని మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ మంగళవారం తెలిపారు.

జగనన్న ఇళ్ల నిర్మాణ పనులను వీరందరు పర్యవేక్షణ చేస్తుండేవారన్నారు. మున్సిపల్ పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్ ఎస్ఈ నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న వీరిని ఐదు మంది ప్రొద్దుటూరుకు, ఇద్దరు పులివెందలకు బదిలీ అయ్యారన్నారు. అయితే వీరి స్థానంలో ఎవర్నీ నియమించలేదు.